తన కెదురుగా వున్న కిటికీ వారం రోజుల్నించి పెద్ద శత్రువులా కనిపిస్తోంది రుక్మిణికి.

'అయిదవుతోంది ... ఈ పాటికి తయారవుతూంటుంది అమ్మగారు అనుకుంది.' లేచే వోపికలేదు. నెమ్మదిగా మోచేతిమీద లేచి మంచంమీదే గోడకానుకుని కూచుంది.

ఎదురుగా కిటికీ...కిటికీలోంచి ఎదురిళ్ళు కనిపిస్తున్నాయి.

'ఇంక ఈయనా వస్తారు' ... అనుకుంది. అలాఅనుకోగానే భర్తఇంటికి రాగానే అడిగే ప్రశ్నలు గుర్తొచ్చాయి...

"మందుతాగావా'? 'పెంపరేచరు చూశావా'... 'నీరసం తగ్గిందా'...?

మొన్నటిదాకా ఆ మాటలకి కరిగిపోయేది. తనంత అదృష్టవంతురాలు లేదని ఎంతగానో మురిసిపోయేది. కాని, ఆ సాయంత్రం భర్త, ఎదురింటి అనూరాధ సైగలు చేసుకోవటం చూశాక.....

'ఛ...వెధవ ఆలోచనలు...ఎంత గుర్తుకుతెచ్చుకోకూడదు అనుకుంటున్నా, అవే వెంటాడి మనసుని పాడుచేస్తున్నాయి.' కావాలనే కిటికీవేపునించి తలతిప్పి పక్కకి చూసింది...దండెం మీద పచ్చటి చీర.

ఆర్నెల్లక్రితం తన పుట్టిన రోజునాడు భర్త కొన్నది. ఆ రోజు ఎంత సరదాగా గడిచింది. ఆ ఒక్కరోజేకాదు...పెళ్ళయిన తరువాత గుర్తుతెచ్చుకుంటే, ఎన్నో అలాంటి రోజులు. ఆయన తనని పసిపిల్లలా చూసుకుంటారని ఎంతో గర్వంగా అనుకునేది.

'కాని ఒక్కనెలలో ఎంత మార్పు?. దరిద్రపు జ్వరం...నా ప్రాణానికి శనిలా పట్టుకుంది. అవును మగవాళ్ళకి, ఆడవాళ్ళ మనసెందుకు? తెళ్ళుతూ తుళ్ళుతూ గడిపినంతకాలమే ఆదరణ, ఆప్యాయత...మంచమెక్కితే..."

వో పక్క నీరసం...లేని వోపిక కూడదీసుకుని లేవటం ... మనసుని బాధించే ఆలోచనలు...తల బద్దలవుతున్నట్టనిపించింది రుక్మిణికి.

తట్టుకోలేక తల బాగా వెనక్కి వాల్చింది. అప్పుడే అనూరాధ ఆరుగు మీద కొచ్చింది. నుదిటిమీది నీలంరంగు బొట్టు సరిచేసుకుంటూ.

"దిక్కూ మొక్కు లేకపోయినా షోకులకేం తక్కువలేదు..." మనసులోనే తిట్టుకుంది రుక్మిణి. అలా అనుకోగానే "ఛళ్" మని కొరడాతో ఎవరో కొట్టినట్టయింది.

తనేనా మూణ్ణెల్లక్రితం అనూరాధ అలా చక్కగా అలంకరించుకోవటం చూసి సంతోషించింది ... 'చిన్నతనంలోనే సరదాలన్నీ...కట్టూబొట్టూ విషయంలో ఎవరో ఏదో అనుకుంటారని చాదస్తాలు పెట్టుకోక మనసుకి తోచినట్టుండమని సలహా యిచ్చింది.'

ఏ ఆలోచనేనా బాధగానే ఉంది రుక్మిణికి. ఇంక కూచోలేక వొరగా వొరిగి పడుకుంది. కిటికీలోంచి ఎండ పొడ పడుతున్నా యిల్లంతా చీకటితో నిండిపోతున్నట్టు భయపడింది. కళ్ళు మూసుకుంటే సింగారించుకుంటున్న అనూరాధ, ఆఫీసునుంచి యింటికి రాగానే వెంటనే వెళ్ళిపోవటానికి భర్తపడే హడావిడి అన్నీ కళ్ళముందు కదిలాయి.

"ఛీ...వెధవ... బ్రతుకు..." అనుకుంది కళ్ళ నిండుగా నీళ్ళొస్తే...

ఇదివరకుసాయంత్రాలు భర్తఅంతగా బైటకి వెళ్ళేవాడుకాదు. ఈ మధ్య ప్రతిరోజూ రాగానే వెళ్ళటానికి హడావిడిపడుతున్నాడు.

మంచంమీంచి లేవటానికే కాదు. ఆలోచించటానికి కూడా తనలో శక్తి చచ్చిపోతున్నట్టనిపించింది రుక్మిణికి.

* * *

"రుక్కూ...రుక్కూ..."

ఆ పిలుపు రోజూ వినేదే...నెమ్మదిగా కళ్ళు తెరిచింది రుక్మిణి.

"ఏమిటి అలా పడుకున్నావు...బాగా నీరసంగా ఉందా?" మంచంపట్టీమీద కూచుంటూ అడిగాడు వాసూ...అతని కళ్ళల్లో ఆతృత కదుల్తోంది.

మనసులో ఒకటి...బయిటికొకటి... యింత నేర్పు ఎలా వస్తుందో మనుషులకి ..."లేదు... బాగానేవుంది..." అంది ముఖాదంగా...

నెమ్మదిగా లేచి గోడకి జేరగిల బడింది రుక్మిణి. అనూరాధ ఒకటి రెండు సార్లు అరుగుమీద కొచ్చింది. భర్త పడుతున్న హడావిడి తెలుస్తూనేఉంది. పచ్చిఅరగంటేనా గడపకుండావాసూ వెళ్ళి పోవటం, వాసూ వెళ్ళిన పది నిముషాల్లో అనూరాధ వీధిలోకి బైలుదేరటం కళ్ళ పడగానే గుండె పగిలినట్టనిపించింది రుక్మిణికి.

'ఇలా కుళ్ళుతూ...యిక్కడే వుండే కన్నా, అయన్ని ఏడిపించేనా సరే పుట్టింటికి వెళ్ళిపోవటం మంచిది ... వెళ్ళిపోతే శాశ్వతంగా భర్తకి దూరం కావాల్సివస్తుందేమో'... పరిపరి విధాల పరిగెట్టే మనసుని లొంగదీసుకోవాలని వ్యర్థప్రయత్నంచేసింది రుక్మిణి.

"నీతోపాటు రావాలంటే ఆఫీసులో సెలవుదొరకదు. నువ్విలాఆనారోగ్యంగా వుండగా వొంటరిగా నిన్ను వొదల లేను..." అన్న భర్తమాటలు ఎన్నో ఏళ్ళక్రితంవి కావు. పదిహేనురోజులేనా పాతబడనివి.

"ఏమైందో ఆ ఆప్యాయత అంతా యిప్పుడు ... " అసలు అది కూడా నటనేమో..."

బెడ్‌లైట్ వేసి వెళ్ళాడు వాసూ... అదికూడా ఆరిపోతే బాగుణ్ణు అనుకుంది రుక్మిణి తలగడలో ముఖం దాచుకుంటూ.

* * *

పుట్టింటికి వెళ్ళిపోతానని చెప్పాలను కుంటూనే రెండు రోజులు గడిపేసింది రుక్మిణి.

"ఎలాగేనా యివాళ చెప్పేయాలి... ఈ నరకయాతనకన్నా అదే నయం... అదృష్టం ఎలావుంటే అలాగే జరుగు తుంది...మనసులేని కాపరం అయనకీ యిబ్బందే... ఎన్నాళ్ళుంటుందో ఈ మోజు...అదీ చూడొచ్చు..."

"రుక్మిణీ మెళుకువగానే ఉన్నావా... దట్స్ గుడ్...రా...రాధా...రా"

అంతా యింద్రజాలంలా ఉంది రుక్మిణికి. వో పక్కన కళ్ళ చివర్లలోకి వచ్చేస్తున్నాయి కన్నీళ్ళు ... మూడు గంటలేనా కాకుండా ఆఫీసువింది భర్త వచ్చేయటం ... అందులో అనూరాధని వెంటపెట్టుకుని పట్టపగలు యింటికే తీసుకురావటం...

"రుక్కూ...నీతో పొద్దున్నే చెపుదా మనుకున్నాను. యీరోజు ఆఫీసుకు వెళ్ళటంలేదని ... కాని ఈ ప్రోగ్రాం నమ్మకంలేదు...అందుకని చెప్పలేదు.." అన్నాడు వాసూ అనూరాధ వేపుచూసి నవ్వుతూ. ఇంకా గుమ్మంలోనే ఉంది అనూరాధ తలొంచుకుని...

ఏం మాట్లాడాలోతోచలేదు రుక్మిణికి. ఎప్పటినుంచో తనకి తెలియకుండానే మనసులో గూడుకట్టుకున్న భయం వొక్కసారిగా పగిలినట్టైంది...

"రా రా మూర్తీ...గుమ్మం అవతలే

ఆగిపోయావే..." అన్నాడు వాసూ. పొడుగ్గా, హుందాగా వున్నాడు మూర్తి. అనూరాధ సిగ్గుపడుతూనే అతని పక్కన నిలబడింది...ఇద్దరూ కలిసి...ఒకేసారి దణ్ణంపెట్టారు రుక్మిణికి.

"బ్రాండ్ న్యూ దంపతులు... నాలుగ్గంటలేనా కాలేదు! ఆశీర్వదించు.." అన్నాడు వాసూ నవ్వుతూ...

ఓ పక్క ఆశ్చర్యం...మరో పక్క పెద్దభారం దిగిపోయిన ఆనందం కలగలిసి కంగారుపెడుతుంటె కళ్ళల్లో నీళ్ళు కదుల్తుంటె రెండు చేతులూ ఎత్తింది రుక్మిణి...

కాస్సేపు కూచుని ... ఆరోగ్యం కుదుటపడగానే వాళ్ళు తీసుకున్న కొత్త యింటికి వోసారి రమ్మని పిలిచి వెళ్ళిపోయారు. కొత్త దంపతులు వెడుతూ, వెడుతూ అనూరాధ వాసువేపు తలతిప్పి చూసింది. ఆ కళ్ళల్లో కృతజ్ఞతతో కదులుతున్న ఆనందం రుక్మిణి చూసింది.

'మూర్తీ, నేనూ, అనూరాధా, మేం ముగ్గురం కలిసి ఒకే కాలేజీలో చదువుకున్నాం. మూర్తిని తరుచుగా కలుసుకోవటానికి భయపడేది అనూరాధ. అందుకని యిద్దరి మధ్యా కొన్నాళ్ళు పోస్టుమేన్ ఉద్యోగంచేశాను.' అన్నాడు వాసూ రుక్మిణికి దగ్గరగా కూచుంటూ.

రుక్మిణి అలాగే చూస్తూ కూచుంది.

"ఎందుకో నువ్వు ఉత్సాహంగా ఉండటంలేదు ఈ మధ్య. నువ్వు ఎంత ఉత్సాహంగా వుంటే అంత తొందరగా కోలుకుంటావు. తెలిసిందా." అన్నాడు తిరిగి వాసూ...

అనవసరంగా అనుమానపడినందుకు మనసులో తనని తనే తిట్టుకుంది రుక్మిణి. వాసూతో తను పడినయాతన అంతా ఎలా చెప్పాలా అన్నదే రుక్మిణి ఆలోచన.

మళ్ళీ హడావిడిగా వాసూ బైలుదేరే ప్రయత్నం చేస్తుంటె ఎక్కడికో అర్థం కాక..."ఎక్కడికి"...అంది.

ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు వాసూ...తరువాత నవ్వాడు.

'అవును నీతో చెప్పలేదుగా...ఇరవై రోజుల్నించి వో ప్రెస్‌లో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నా...నువ్వేం బెంగపెట్టుకోకు అంత అలసిపోయే పనేంకాదులే.. నువ్వుకొంచెం కోలుకోగానే ఈ ఖర్చులు తగ్గుతాయి. అప్పుడు మానేస్తా...సరేగా ...నువ్వేం ఆలోచించకుండా విశ్రాంతి తీసుకో...' అని వెళ్ళిపోయాడు.

కళ్ళు చెమరుస్తుంటె ...'నిజంగానే అదృష్టవంతురాల్ని' అనుకుంది. నీరసం తగ్గిపోయి వొంట్లో బలంచేరుతున్నట్టనిపించింది రుక్మిణికి.



సుబ్బారావు అందరిముందూ తం వాల్చుకూచున్నాడు. ముఖంలో జీవ కళలేదు. గడ్డం మాసింది. జుత్తు రేగి కళ్ళమీదికి పడుతోంది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే సుబ్బారావును ఎరుగుదును, ఇలా సగం చచ్చినవాడు సుబ్బారావేనా అనిపిస్తోంది.

బయట ఎండ క్రమంగా వేడెక్కుతోంది. కుర్చీ పక్క కిటికీలోంచి ఎండ ఊచల మీంచి నీడలుగా సుబ్బారావు ముఖం మీదకి జారింది. చుక్కా సాహెబు దానికి గల వింతఅర్థాన్ని వెదుకుతున్నాడు. అతని పక్కనే రాజా ముళ్ళమీద కూచున్నట్టుగా మాటి మాటికీ అటూ యిటూ కదులుతున్నాడు సబ్‌ఇన్‌స్పెక్టర్ కుమార్ సుబ్బారావును